# 1. గొడ్రాలు

వాతావరణం ఎంతో బాగుండటంవల్ల, రోజూకన్న ముందుగానే భోజనాలు ముగించుకొని, పనివాళ్ళందరూ పొలాల్లోకి వెళ్ళిపోయారు. రోజ్ ఒక్కతే, ఆ పెద్ద వంటింట్లో మిగిలిపోయింది. పొయ్యిమీది కాగులోని నీళ్ళు సలసలా కాగినవి. నిప్పు ఆరిపోతూ వుంది. ఆమె ఆ కాగులోని నీళ్ళను చూసుకుంటూ, భోజనం చేసిన ప్లేట్లను కడుగుతూ, అప్పుడప్పుడు లేత సూర్యకిరణాలు భోజనాలు చేసిన పెద్ద టేబిల్ మీదికి ప్రసరిస్తూ, కిటికీ గాజు తలుపుల్లోని లోపాల్ని ఎత్తి చూపటాన్ని గమనిస్తూనే వుంది.

మూడుకోళ్ళు ధైర్యంగా భోజనాల గదిలోకి ప్రవేశించి కిందపడ్డ మెతుకుల్ని ఏరుకొని తింటున్నవి. సగం తెరిచి ఉన్న వంటింటి ద్వారంగుండా, కోళ్ళకొట్టు వాసనా, కాస్త దూరానవున్న గొడ్లచావిడి వాసనా వస్తూనే వుంది. దూరాన కోడిపుంజు ఎందుకోగాని గోలచేస్తూ వుంది.

ఆమె తన పనినంతా ముగించుకొన్న సంతోషంతో ఒక్కసారి దీర్ఘంగా గాలిపీల్చి వొదిలింది. అకారణంగా ఆమె మనస్సు బాగాలేదని గ్రహించింది. వంటింటిమట్టి గోడలన్నీ పొగబారి నల్లబడినయ్. గోడనిండా బూజు వేళ్లాడుతూ వుంది. ఘాటైన ఉల్లిపాయల వాసన కొడుతూ ఉంది. నేలమీద చిందరవందరగా పడివున్న పాత్ర సామానూ, పాలకడవలు మొదలైనవి కూడా సర్దేందుకు ఆమెకు ఎక్కువసేపు పట్టలేదు.

ఇంటిపనులయాక, మామూలుగా కుట్టుపనిలో కొంతకాలం గడిపేదామె. కాని యీనాడు ఆమెకాశక్తి నశించినట్టే తోచింది. బైటికిపోయి కొంత చల్లగాలి మేస్తేనేకాని తిరిగి ప్రాణం తేరుకునేట్టుగా ఆమెకు తోచలేదు.

కోడిపెట్టలు కొన్ని పేడకుప్పమీద కూర్చున్నవి. మరికొన్ని కాళ్ళతో నేలను కెలుకుతూ ఆహారాన్వేషణలో ఉన్నవి. నీటిమధ్యగా పుంజు ఎంతో గర్వంతో నిలబడి వుంది. అప్పుడప్పుడు యీ పెట్టల్లో ఒకదానితో కలిసి పుంజు అటూ ఇటూ పచారుచేసి, తన గొప్పతనాన్ని నిరూపిస్తోంది. ఒళ్ళు దులుపుకొని, రెక్కలు బాగా చాచి, పెద్ద పేడకుప్పమీద బద్ధకంగా వాలుతూ కూయటం, దానికి జవాబుగా జరుగుతోంది. మొత్తం మీద కోళ్ళు ఏదో ఆనందంతో గోలచేస్తూ వున్నవి.

ఏమీ ఆలోచించకుండానే, ఆమె యీ కోళ్ళగుంపుల మందను చూసింది. ఆ తరువాత సీమరేగు చెట్లవైపు దృష్టి సారించింది. ఆ చెట్లన్నీ విరబూచి వున్నవి. ఇదే సమయంలో ఒక గుఱ్ఱపు పిల్ల చెంగు చెంగున ఎగురుకుంటూ ఆమె ముందునుంచి పరుగెత్తింది. కాస్త దూరంలో వున్న రెండు గోతుల్లోకి దూకి, చప్పున ఆగి, ఇప్పుడే తన ఒంటరితనాన్ని తెలుసుకున్న ఆశ్చర్యంతో నిలబడిపోయింది.

రోజ్ కూడా ఆనందంతో పరుగెత్తాలని, గంతులు వేయాలని అనుకుంది. శరీరమంతా చాచి, ఆ ఎండలో వెచ్చగా, హాయిగా పడుకొని చెట్లకొత్తపూతల మీదినుంచి వొచ్చే గాలిని పీల్చాలనుకుంది. నాలుగైదు అడుగులు వేశాక, ఏదో హాయితో, తన్మయత్వంతో ఆమె కళ్ళు మూసుకుంది. వెంటనే తేరుకొని, కోళ్ళకొట్టాంలో గుడ్లు ఉన్నవేమోనని చూసేందుకు వెళ్ళింది. అక్కడ వున్న పదమూడు గుడ్లనూ తీసుకుని వంటింట్లోకి వెళ్ళి జాగర్త చేసింది. ఆ వంటింటి వాసన ఆమెకు ఎంతో విసుగు కలిగించింది. కొంచెంసేపు ఆ పచ్చని పచ్చికమీద పడుకోవాలనిపించి తిరిగి బైటికి వెళ్ళింది.

ఆ దొడ్డినిండా వున్న చెట్లన్నీ తన్మయత్వంతో నిద్రిస్తూన్నట్టే తోచింది. పచ్చగా, వొత్తుగా, ఎత్తుగా పెరిగిన గడ్డిలోనుంచి, రంగురంగుల గడ్డిపువ్వులూ ఎంతో అందంగా నేలమీద మంచినగిషీ పనిచేసిన మెత్తని తివాసీ పరిచినట్టుగా వుంది. రాత్రిపడ్డ మంచు, ఎండకు కరుగుతూ, చెట్టుచేమల్ని మెరిపిస్తూ వుంది. గడ్డిమీదినుంచి వొచ్చే తమాషా వాసన మత్తు కలిగిస్తూ వుంది. చెట్లు నీడల్ని నేలబారున జాపించి, వసంతాగమనాన్ని నిరూపించే ప్రకృతి అంతా ఎంతో శోభాయమానంగా వుంది.

ఆమె గొడ్లసావిట్లోకి వెళ్ళి ఎండుగడ్డిని తెచ్చి బైట నేలమీద వేసి కూర్చొంది. ఆ ప్రదేశానికి దిగువ పొలాలున్నవి. మనుష్యులు పనిచేస్తున్న దృశ్యం స్పష్టంగా కనిపిస్తూ వుంది. వారు చాలా కింద భాగంలో ఉండటం వల్ల వేలెడు మనుషులల్లే కనిపిస్తున్నారు.

ఆమె కూర్చున్నదన్నమాటే కాని ఆమె కది సుఖంగా లేదు. వెంటనే గడ్డిని బాగాపరిచి, వెల్లకిలా పడుకుంది. క్రమంగా ఆమె కన్నులు మూతలుపడసాగినవి. ఆమె తనకి తెలియని అయోమయంలోకి ప్రయాణం చేస్తున్నట్టు తోచింది. ఆమెను నిద్రాదేవి దాదాపు తనలోకి లీనం చేసుకుంది... ఏవో రెండు చేతులు రొమ్ములమీద

వాలేప్పటికి ఒక్కసారిగా ఆమె ఈ భూమి మీదికి పడ్డట్టయింది. వెంటనే ఆమె లేచి నిలబడ్డది. ఎదుటివ్యక్తి ఆ భూస్వామి దగ్గర పనిచేసే కూలివాడు. చాలాకాలం తనతో ప్రణయాన్ని సాగించాలని విశ్వప్రయత్నం చేస్తూన్న జాన్ గొర్రెల్ని చూస్తూ ఆమె పడుకోవడం చూసి, దొంగచాటుగా మెల్లిగా ఆమె పక్కకు జేరాడు!

అతను ఎలాగైనా ఆమెను ముద్దుపెట్టుకోవాలని చూశాడు. కాని ఆమె అతనంత బలమున్న మనిషి కావటం వల్ల జాన్ ఆటలు సాగలేదు. మోహం మీద బలమైన దెబ్బతో ఆమె తన బాహుబలాన్ని ప్రదర్శించగానే, మరోమార్గంలేక జాన్ ఆమెను క్షమాపణ కోరాడు. ఆ వ్యవహారం సాఫీగానే తేలిపోయింది. ఇద్దరూ ఒకరి పక్కన ఒకరు కూర్చొని మాట్లాడుకోసాగారు. వారు వసంతాన్ని గూర్చీ, తను యజమానిని గూర్చీ, ఇరుగుపొరుగుల్నీ గూర్చి, తమను గూర్చీ, ఇంకా ఇలాటివే లక్షాతొంభై విషయాల్ని గూర్చి మాట్లాడారు. చాలాకాలంగా తాము చూడని తమ బంధువుల్ని గూర్చి మాట్లాడుకున్నప్పుడు, ఆమె ముఖంలో విచారరేఖ కనిపించింది. ఆమె యీ ఆలోచనల్లో వుండగా ఉద్రేకంతో ఊగిపోయ్యే జాన్ సమయం కనిపెట్టి వణుకుతూ ఆమెను రాచుకోసాగాడు.

'మా అమ్మను చూసి చాలాకాలమైంది. యీ విధంగా దూరదూరాన ఉండటం ఎంతో కష్టం' అని ఆమె ఉత్తర దిశవైపు - ఎక్కడో ఎంతో దూరాన వున్న తమ పల్లెకోసం దిశాంతంలోకి చూడసాగింది.

హఠాత్తుగా జాన్ ఆమె మెడను వొంచి ముద్దుపెట్టుకున్నాడు. ఆమె ఈసారి పిడికిలి బిగించి లాగి అతని ముక్కుమీద కొట్టింది. అతని ముక్కువెంట రక్తం రాసాగింది. ఆ దెబ్బతో అతను దూరంగా జరిగి చెట్టుకొమ్మను ఆనుకొని నిలబడ్డాడు.

ఆ దృశ్యానికి ఆమె బాధపడి, అతని దగ్గరకు వెళ్ళి "బాగా తగిలిందా?" అని అడిగింది.

అతను నవ్వి జవాబుగా "మరేం ఫర్వాలేదు" అన్నాడు. ఆ దెబ్బ నసాళం అంటినా అదంతా మరిచిపోయి, ఆమె తన ఆరాధ్యదేవత అయినట్టు ఎంతో కుతూహలంతో, ఒక విధమైన గౌరవంతో, నిజమైన ప్రేమ తొణికిసలాడేట్టు ఆమె ముఖంలోకి చూడసాగాడు.

రక్తం కారటం ఆగగానే "కొంచెం షికారు వెళ్ళొద్దాం" అన్నాడతను. తన పక్కనున్న రోజ్‌తో ఎక్కువసేపు ఉండటం తనకొక విధంగా హానికరమనే సంగతి అతనికి బాగా తెలుసు. ఆమె తనంతతానుగా అతని చేతిని తన చేతిలోకి తీసుకుంటూ "నన్నీవిధంగా ద్వేషిస్తావెందుకూ?" అని నడవసాగింది.

అతను ఆ మాటలకు తుళ్ళిపడ్డాడు. ఇప్పుడు ఆమె అంటే అతనికి ద్వేషభావం లేదు. ప్రేమభావమే నిలిచిపోయింది.

ఆ సంగతి చెప్పినప్పుడు "ఐతే నన్ను నిజంగానే పెళ్ళి చేసుకోవాలని వుందన్నమాట?" అందామె.

ఆమె దృష్టి ముందుకే సారించింది; అతను కొంచెం ఆగి, పక్కవాటుగా ఆమెను చూశాడు. ఆమె శరీరమంతా యవ్వనపు పొంగులు స్పష్టంగా కనిపిస్తున్నవి. చిరుచెమట బిందువుల్లో సూర్యకిరణాలు ప్రతిఫలించి ఆమె శరీరానికే ఒక కొత్త అందాన్ని ఇచ్చినవి. అతనిలో కొత్త ఆశాస్రవంతి కట్టలు తెంచుకుంది.

తన పెదవుల్ని ఆమె చెవుల దగ్గర వుంచి రహస్యంగా "తప్పకుండా పెళ్ళి చేసుకోవాలనే వుంది" అన్నాడు.

వెంటనే ఆమె తన రెండుచేతుల్లోనూ, అతన్ని పొదివి దగ్గరకు లాక్కుని చాలాసేపు... ఇద్దరికీ దాదాపు ఊపిరాడనంత సేపు ముద్దుపెట్టుకుంది. ఆ క్షణానే వారి మధ్య ప్రణయగాథ ఆరంభమైంది.

వారు గదిమూలాల్లోని చీకట్లలో, పెద్ద బయలులోని వెన్నెల్లో, గడ్డివాముల చాటున తరచుగా కలుసుకోసాగారు. క్రమంగా జాన్‌కు ఆమె అంటే రోత పుట్టసాగింది. సాధ్యమైనంతవరకూ ఆమెను తప్పించుకొని తిరిగేవాడు. కావలసినంతవరకే ఆమెతో సంభాషించేవాడు. ఆమెను కలుసుకోవటానికి మారుగా, కావాలని పక్కదార్ల పోవటాన్ని ఆమె గమనించకపోలేదు. ఆమె విచారంతోనూ, ఆదుర్దాతోనూ బాధపడసాగింది. మరీ తాను గర్భవతని తెలిసినప్పటి నుంచీ ఆమె విచారం అధికమైంది.

మొదట్లో ఆమె భయంతో వొణికిపోయింది. ఆ తరువాత అతన్ని కలుసుకునే ఆమె ప్రయత్నాలన్నీ విఫలం కావటం వల్ల, అతను కావాలని తననుంచి తప్పుకొని తిరుగాడటం వల్ల ఆమె కోపోద్రిక్తురాలైంది.

చివరకు ఒకనాటి అర్ధరాత్రి అందరూ గాఢనిద్రలో వుండగా, ఆమె ఆ రాత్రి దుస్తులతోనే, చలిలో కాలికి పాదరక్షలన్నా లేకుండానే, దూరానవున్న గుర్రాల సావిడి దగ్గరకు ధైర్యం చేసి వెళ్ళింది. జాన్ పెద్దపెట్టెలో ఎండుగడ్డి వేసుకొని, వెచ్చగా పడుకొని వున్నాడు. అతను కూడా నిద్రించడం లేదు. ఆమె రాకను గమనించి గురకసాగించి, తాను గాఢనిద్రలో వున్నట్టు నటించాడు. ఆమె మోకాళ్ళమీద వొంగి, అతన్ని జాగర్తగా కదుపుతూ నిద్రనుంచి మేల్కొల్పి కూర్చునేట్టు చేయగలిగింది.

"నీకేం కావాలి?" అన్నాడు నిర్లక్ష్యంగా.

ఆమె పళ్ళు కొరికి, కోపంతో వొణికిపోతూ "నీవు... నీవు... వాగ్దానం చేసిన ప్రకారం నన్ను పెళ్ళాడు" అంది.

అతను ఎగతాళిగా నవ్వుతూ జవాబు చెప్పాడు: "ఏదో పొరపాటునో, గ్రహపాటునో అనుభవించటం తటస్థించిన యువతులందర్నీ, పురుషుడు పెళ్ళాడటం జరిగితే... ఇంక చెప్పవలసిందేముంది?"

ఆమె ఇక ఆగలేక, అతని గొంతు పట్టుకొని, వెల్లకిలా పడేసింది. ఆ తరువాత అతని గొంతును బలంగా పిసుకుతూ "నేను రాక్షసిని... తెలిసిందా బ్రహ్మరాక్షసిని!" అంది.

అతను ఊపిరికోసం పెనుగులాడాడు. ఆ చీకట్లో ఇద్దరూ అదేవిధంగా గాలి పీల్చే శబ్దం కూడా వినిపించనంత నిశ్శబ్దంతోనే కొన్ని నిమిషాలపాటున్నారు. ఇంతలో గుర్రం సకిలించి దగ్గరనే వున్న గడ్డిని లాక్కుంది. యీ శబ్దమే భరించలేని మౌనాన్ని ఛేదించింది.

తన కన్న ఆమె బలశాలి అన్న విషయాన్ని గ్రహించిన జాన్ "సరే. నిన్ను పెళ్ళాడుతాను" అన్నాడు.

ఆమె అతని వాగ్దానాల్ని నమ్మదలుచుకోక అంది. "యీ క్షణంలోనే జరగాలి. ఇప్పుడే యీ వివాహం ప్రకటించబడాలి" అంది.

"యీ క్షణానే!" అన్నాడు జాన్.

"ప్రమాణం చెయ్యి."

కొంచెం తటపటాయించి "భగవంతుని సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను" అన్నాడు.

వెంటనే ఆమె అతని గొంతు పట్టును విడిచి, ఒక్కమాట కూడా మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

తిరిగి అతన్ని ఒంటరిగా కలుసుకునే అవకాశం కానీ, అతనితో మాట్లాడే అవకాశం కానీ ఆమెకు కలగలేదు. రాత్రిళ్ళు గుర్రపుశాల తాళంవేసి వుంటోంది. తలుపుకొట్టి జాన్‌ను లేపే ధైర్యం ఆమెకు లేదు. ఊరంతా తన విషయం తెలిసిపోతుందేమోనని ఆమె భయం!

చివరికి ఒకనాడు ఒక కొత్తవ్యక్తి భోజనానికి వచ్చాడు. ఆమె "జాన్ వెళ్ళిపొయ్యాడా?" అంది.

ఆ కొత్తవ్యక్తి "ఔను. అతని ఉద్యోగం నాకు వచ్చింది" అన్నాడు.

యీ వార్త ఆమెను ఎంతగానో వొణికించింది. పొయ్యిమీది పెనాన్ని తీసే శక్తి కూడా ఆమెకు లేదు. నరాల బలహీనతతో కుంగిపోయింది. భోజనాలయ్యాక, అందరూ వెళ్ళిపోయారు. ఆ మధ్యాహ్నం ఆమె తన గదిలోకి వెళ్ళి ఏకాంతంగా ఏడ్చింది. తన ఏడుపు ఎవరికైనా వినిపిస్తుందేమోనని నోట్లో గుడ్డలు కుక్కుకుంది.

ఆ పగలు, ఎవరికీ ఏ అనుమానమూ కలగకుండానే జాన్‌ను గూర్చి కొన్ని వివరాలు తెలుసుకో గలిగింది; కాని ఆమె తన దురదృష్టాన్ని గూర్చిన ఊహల్లో- తనకు జవాబులు చెప్పిన వారంతా, తనను చూసి హేళనగా నవ్వుతున్నారనే

అభిప్రాయపడింది... ఆమెకు తెలిసిందల్లా - జాన్ ఆ చుట్టుప్రక్కలనే లేకుండా వెళ్ళిపోయాడు!

## 2

ఒక పెద్ద నిరాశా మేఘం ఆమెను ఆవరించింది. ఒక దుఃఖ సముద్ర మధ్యంలోనే ఆమె జీవితం పెనుగులాడసాగింది. ఆమె ఒక యంత్రంవలె పనిచేయసాగింది. ఆమెకు ఇతర ఆలోచనలేమీ లేవు. 'నా సంగతి వీళ్ళందరికీ తెలిస్తే...?' ఇదొక్కటే ఆమె సమస్య!

యీ బాధతో అన్నివేళల్లోనూ కుమిలిపోతూండటం వల్ల సకారణమైన ఆలోచనే ఆమె బుర్రలో ప్రవేశించలేదు. రోజులు దగ్గరపడుతూన్నవనీ, ఇది మృత్యువువలె గురితప్పనిదనీ ఆమెకు తెలుసు. ఏ విధంగానన్నా తప్పుకునేందుకు అవకాశాలున్నా, ఆ ఆలోచనలే ఆమెకు కలగటం లేదు. అందరికన్నా ముందుగానే నిద్రలేచి, చిన్న అద్దంముక్కలో చాలాసేపటి వరకూ తనను తాను చూసుకుంటుంది. తనలోని మార్పుల్ని ఎవరైనా కనిపెట్టారేమోనని ఆమె ఆతృతపడేది. పగలు పనిచేస్తూ చేస్తూ ఆగి, తనను తాను పరీక్షించుకుంటుంది. గర్భం పెరిగిందేమో, తన దుస్తులు తన స్థితిని మరి దాయలేవేమోననే ఆమె బాధ.

నెలలు గడుస్తున్నవి. ఆమె ఎవరితోనూ మాట్లాడేది కాదు. ఎవరైనా ఏమైనా అడిగినా ఆమె అర్థం చేసుకునే స్థితిలో కూడా లేదు. ఆమె కళ్ళల్లో భయం ఉట్టిపడుతూ వుంది. ఏ పనన్నా చేసేందుకు చేతులు వణుకుతూన్నవి. ఆమె యజమాని "పిచ్చిపిల్లా! ఈ మధ్య మూర్ఖురాలివిగా మారుతున్నావేం?" అన్నాడు.

చర్చ్‌లో ఆమె ఒక స్తంభంచాటున దాక్కునేది. మతాధికారి ఎదుటపడే సాహసం ఆమెకు లేదు. మతాధికారికి మానవాతీతమైన శక్తులున్నవని ఆమె నమ్మేది. ఇలా నమ్మేవాళ్ళ స్థితిని మతాధికారి నిజంగానే తెలుసుకో గలుగుతాడని పాపం ఆమెకు తెలియదు. భోజన సమయాల్లో మిగతా సేవకులు తనవైపు చూడటమే ఆమెను మూర్ఛపోయే పర్యంతం చేసేది. గొడ్లను కాచే కుర్రాడి కళ్ళు తళతళలాడేవి. వాడు తనను పరీక్షగా కనిపెట్టి చూస్తున్నాడనీ వాడికి తన రహస్యం తెలిసిపోయిందనీ, ఇక క్రమంగా మిగతా అందరూ తన స్థితిని తెలుసుకుంటారనీ ఆమె ఊహించుకొని ఎంతో బాధపడేది.

ఒకనాటి ఉదయాన ఉత్తరాల బంట్రోతు వొచ్చి, ఆమెకొక ఉత్తరం ఇచ్చి వెళ్ళాడు. ఆమె జీవితంలో ఇదే మొట్టమొదటి ఉత్తరం కావటం వల్ల ఆమె గాబరాపడింది; ఏదో నరాల బలహీనత్వంతో అక్కడే కూలబడిపోయింది. యీ వుత్తరం... బహుశా జాన్ రాశాడేమో? కాని తనకు చదువురాకపోవటం వల్ల ఆ తెల్లని ఉత్తరంమీద నల్లసిరాతో

రాయబడ్డ వంకర టింకర అక్షరాల్లో ఏముందో తెలుసుకోలేక వొణికిపో నారంభించింది. కొన్ని నిమిషాలు గడిచాక కాని, ఆమె తన స్థితిని తెలుసుకోలేక పోయింది. ఇతరులెవరికైనా తన స్థితి తెలిసిపోతుందనే భయంతో ఆమె ఆ జాబును గౌను జేబులో దాచేసింది.

ఆమె పనిచేస్తూ చేస్తూ ఆగి, ఆ జాబును బైటికి లాగి అక్షరాల అర్థం తనకు హఠాత్తుగా తెలిసివొస్తుందేమో అని ఆశతో తీక్షణంగా చూసేది. చివరకు ఆమెకు ఆతృతతో... భయంతో పిచ్చెక్కినట్టయింది. ఆమె యీ స్థితిని ఓర్చలేక ఒక బడిపంతులు చేత ఉత్తరాన్ని చదివించుకుంది.

అది ఆమె తల్లి రాయించింది. తనకు ఆరోగ్యం బొత్తిగా బాగాలేదనీ వీలుంటే వెంటనే రమ్మనీను.

ఆమె ఏమీ మాట్లాడకుండానే ఇంటి ముఖం పట్టింది. ఆమె ఒంటరిగా నడుస్తున్నప్పుడు, ఆమె కాళ్ళలో శక్తిలేక దారికి పక్కగా వొరిగిపోయింది. చీకటిపడేవరకూ ఆమె అక్కడే వుంది.

ఎలాగో కాళ్ళీడ్చుకుంటూ ఇంటికివొచ్చి, తన తల్లి స్థితిని గూర్చి యజమానికి చెప్పింది. ఆమెకు కావలసినన్ని రోజుల వరకూ సెలవు మంజూరు చేయబడింది. "నీవు తిరిగి రాగానే ఉద్యోగంలో ప్రవేశించవచ్చు" అన్నాడు యజమాని. రోజ్ తన ఊరు జేరిన మరునాడే ఆమె తల్లి చనిపోయింది. మర్నాడే రోజ్ ఏడునెలల బిడ్డను కన్నది. ఆ బిడ్డ అతి బలహీనంగా ఒక చిన్న అస్థిపంజరంలాగు, చూసినవాళ్ళు భయపడేటట్టుగా వున్నాడు. వాడు కాళ్ళూ చేతులు ఆడిస్తూంటే ఎంత బాధ పడుతున్నాడోనని రోజ్‌కు బాధకలిగేది. కాని ఇన్ని అవస్థల్లోను కూడా వాడు బతకగలిగాడు! తన గ్రామంలో ఆమె తనకి వివాహమైందనే ప్రకటించింది. అందరూ నమ్మారు కూడాను. కొన్ని కారణాల వల్ల ప్రస్తుతం యీ బిడ్డను పెంచడానికి తనకు తగిన అవకాశాలు లేవనే కారణంతో, ఆమె పొరుగింటివారికి వాణ్ని అప్పగించింది. పొరుగువారు జాగర్తగా పెంచుతామని రోజ్‌కు వాగ్దానం చేశారు. ఆమె తిరిగి తన మామూలు పనిలోకి ప్రవేశించింది.

ఆ సమయంలోనే చాలాకాలం క్రితమే గాయం చేయబడ్డ ఆమె హృదయసీమలో ఒక మెరుపు మెరిసినట్టయింది. తాను విడిచిపెట్టి వొచ్చిన ఆ బలహీనమైన తన బిడ్డ మీదకు ఆమె మనసు పోయింది. యీ పుత్రప్రేమ ఆమెను ప్రతి గంటా ప్రతినిమిషమూ బాధిస్తూనే వుంది. ఆ బిడ్డను తన చేతుల్లోకి తీసుకోవాలనీ, రొమ్ములకు హత్తుకోవాలనీ, ఆ బిడ్డ శరీర స్పర్శ కావాలనీ ఆమె కోరింది. యీ తీరని కోరికే ఆమెను కొత్త బాధకు గురిచేసింది. రాత్రులు యీ ఆలోచనలతో ఆమెకు నిద్రపట్టటం లేదు. పగలు ఏ పని చేసినా తన బిడ్డను గూర్చే ఆలోచించేది. సాయంత్రం పని ముగించుకున్నాక,

అగ్నిగుండం ముందు కూర్చుని, శూన్యదృక్కుల్తో అగ్నిగుండంలోకి పిచ్చిదానివలె చూస్తూండేది.

ఆమె రహస్యం ఎలా బట్టబయలైందో కాని, వారంతా ఆమెను గూర్చే మాట్లాడేవారు. ఆమె ప్రియుడి స్వరూపాన్ని గూర్చి చర్చించేవారు. "నీ భర్త పొడుగ్గానూ, అందంగానూ వుంటాడా? బాగా డబ్బున్నవాడేనా? పిల్లవాణ్ణి చర్చికి ఎప్పుడు తీసుకొని వెళ్తావు" మొదలైన ప్రశ్నపరంపరల్ని ఆమె తట్టుకోలేక, పరుగెత్తి, ఒంటరిగా కూర్చొని ఏడ్చేది. యీ ప్రశ్నలన్నీ పదునైన సూదులు శరీరంలో దిగినంత బాధపెట్టేవి. ఇతరుల వేళాకోళాల్ని దూసుకునేందుకుగాను ఆమె మరింత శక్తితో పనిచేసేది. పని చేస్తున్నంతసేపూ ఆమె తన బిడ్డను గూర్చే ఆలోచించేది. తాను కష్టించి పనిచేయటం వల్ల, తన యజమాని సంతోషించి, జీతం పెంచుతాడనీ, తన బిడ్డకుగాను, తాను కొంతడబ్బును కూడబెట్టాలనీ ఆమె నిశ్చయించుకుంది.

వంటింటిపని అంతా ఆమె చేసేది. ఇద్దరు మనుషుల పనీ రోజ్ ఒక్కతే చేయటం వల్ల, రెండో వంటమనిషిని యజమాని తీసివేయవలసి వచ్చింది. అంతకు పూర్వం వృథా అయిపోయే ఆహారధాన్యాల్నీ, రొట్టెనూ, నూనెనూ, కొవ్వొత్తుల్నీ అన్నిటిని కూడా ఆమె ఎంతో పొదుపుగా వాడుతూ చాలా మిగిల్చేది. ఆ డబ్బంతా యజమానిది గాక, తనదిగానే భావించి ప్రతివిషయంలోనూ ఎంతో పొదుపుతనాన్ని నిరూపించేది. ఏదైనా కొనవలసి వచ్చినా, అమ్మవలసి వచ్చినా, జాగ్రత్తగా ఆలోచించి, యజమానికి లాభసాటిగా వుండేట్టు చేసేది. యీ విషయాల్ని జాగ్రత్తగా గమనించిన యజమాని కొనటంలోనూ, అమ్మటంలోనూ ఆమెకు ఎంతో స్వాతంత్ర్యాన్ని ఇచ్చాడు.

ఆమె ప్రతి పనినీ పరీక్షించి కిటుకును కనిపెట్టేది. ఆమె సలహాల ప్రకారం పొలం పని జరగటం ప్రారంభమయ్యాక యజమాని ఆస్తి విపరీతంగా పెరగసాగింది. ఐదుమైళ్ళ చుట్టుపట్ల ఆమె యజమాని విలిన్స్ ఆస్తిని గూర్చి ప్రజలు మెచ్చుకుంటూ మాట్లాడేవారు. విలిన్స్ కూడా రోజ్ గూర్చి "ఆమె... ఆమె ఎత్తుబంగారం విలువ, ఆమెకు తక్కువ!" అనేవాడు.

కాలం గడుస్తోంది కాని, ఆమె జీతం పెరగనే లేదు. ఆమె కష్టించి పనిచేయటమనేది బుద్ధిమంతురాలైన తననుంచి, యజమాని ఆశించ దగిందనే దృష్టిలోనే ఉండిపోయింది. ఆమెకు మిగిలిందల్లా- అంతే! తన పనితనాన్ని బట్టి యజమాని ధనాన్ని సంపాయిస్తున్నాడు. ఐనా తన సంగతి ఆలోచించనే లేదు.

చివరకు తన జీతం పెంచమని యజమానిని అడుగుదామనే నిశ్చయించుకుంది. ఈ సందర్భంలో బడిపంతులు సలహా అడుగుదామని ముమ్మాటు వెళ్ళింది కాని, అతనితో యీ విషయం మినహాగా అనేక ఇతర విషయాలు మాట్లాడి ఇంటికి తిరిగి వొచ్చేది. డబ్బును గూర్చి అడగటానికి ఆమె ఎంతో సిగ్గుపడింది. అది ఆమెకు తక్కువ విషయంగా తోచింది.

ఒకనాడు యజమాని ఒక్కడూ భోంచేస్తూండగా "మీతో ఒక విషయం మాట్లాడాలి" అంది సిగ్గుపడుతూ. ఆయన ఎంతో ఆశ్చర్యంతో నోరు సగానికి తెరిచి ఆమె ముఖంలోకి సూటిగా చూశాడు. ఆ చూపు ఆమెకు ఎంతో బాధను కలిగించింది. అసలు విషయాన్ని తప్పించి "నాకు ఒంట్లో సరిగ్గా లేదు. నాకోవారం సెలవు ఇప్పిస్తే మావూరు వెళ్ళివస్తాను" అని అడిగింది.

దీనికి తన అంగీకారాన్ని తెలియపరుస్తూ ఏదో వికారంతో "నువ్వు తిరిగి వచ్చాక, నీతో నేనొక ముఖ్య విషయం మాట్లాడాలి" అన్నాడు.

## 3

ఆమె బిడ్డకు ఎనిమిదో నెలవచ్చిన సంగతి కూడా ఆమెకు తెలియదు. పూర్వపు ఎముకల కుప్పకు బాగా కండరాలు వచ్చి, కొంత కొవ్వు కూడా పట్టి, బిడ్డ నున్నగా తయారయ్యాడు. ఒళ్ళు తెలియని ప్రేమావేశంలో ఆమె బిడ్డమీద పడి, వాడ్ని బలంగా రొమ్ములకు హొత్తుకొని, ముద్దులాడింది. వాడికి బాధ కలిగి, గుక్కపట్టి, ఏడవటం మొదలుపెట్టాడు. తను చేసిన పిచ్చి పనికి ఆమె కూడా వాడితో శృతి కలిపింది. ఇంతలోకే దాది వస్తే, పిల్లవాడు ఆమె వైపు చేతులు జాపాడు. వాడికి పాపం రోజ్ ఎవరో ఏం తెలుసు?

కాని మర్నాటి నుంచీ బిడ్డ రోజ్‌కు అలవాటవసాగాడు. ఆమెను చూసి చేతులు జాపి నవ్వినప్పుడు, ఆమె కెంతో ఆనందమైంది. వాడ్ని చంకనేసుకుని, పిచ్చిదానివలె పచ్చిక బయలుమీద పరుగెత్తింది. అలసిపోయి, ఏ చెట్టునీడనో కూర్చుని ఆమె, తన జీవితంలో మొట్టమొదటిసారిగా, యీ బిడ్డ దగ్గర మాత్రమే తన హృదయారాటాన్ని తన కష్టసుఖాల్నీ, తను చేసే శరీర కష్టాన్నీ భావిలో తనకుగల ఆశల్నీ ఒకటేమిటి ఆమె జీవితాన్నే వెళ్ళబోసుకునేది. బిడ్డ ఆమె ముద్దులతో, కౌగిలింతలతో విసుగెత్తేవాడు.

ఈ బిడ్డను గూర్చిన జాగ్రత్తలో ఆమెకు ఎంతో ఆనందం కలిగేది. తన మాతృత్వాన్ని దృఢపరుచుకునేందుకేమోనన్నట్టు, తనే స్వయంగా వాడికి నీళ్ళుపోసి, బట్టలు వేసేది. ఉండి వుండి యీ బిడ్డ తన రక్తమాంసాల్ని పంచుకొని పుట్టాడనే వూహ కొంత ఆశ్చర్యాన్ని కలిగించినా, వెంటనే తనకూ ఒక బిడ్డ వున్నాడనే గర్వంతో కూడిన ఆనందోద్రేకం ఆమెకు కలిగేది. మెల్లిగా 'యీ బిడ్డ నాది... నాదే!' అనేది.

ఆమె తిరిగి యజమాని దగ్గరకు వెళ్తూ దారిపొడుగునా, ఏకధారగా ఏడ్చింది. ఆమె ఇంట్లోకి ప్రవేశించబోతుండగా, యజమాని తన గదిలోనుంచి ఆమెను పిలిచాడు. అకారణంగా ఆశ్చర్యమూ, నరాలబలహీనత్వమూ ఆమెను ఆవరించినవి.

"అట్లా కూర్చో" అన్నాడతను.

కొన్నిక్షణాల పాటు వారు ఒకరిపక్కన ఇంకొకరు కూర్చున్నారు. వారి మధ్య నిశ్శబ్దమే దొర్లింది. చేతులుజార్చి, వాటితో ఏం చెయ్యాలో తెలియని స్థితిలోనే వారు అచేతనంగా ఉండిపోయారు. పట్టి అమాయకులవలె ఒకరి మొహంలోకి ఇంకొకరు చూసుకున్నారు.

యజమాని వయస్సు 45 సంవత్సరాలైనా, ఎంతో దృఢంగా, కండలు తిరిగిన శరీరం కావటం వల్ల అంత వయసున్నట్టు కనిపించదు. అతని జీవితంలో ఇద్దరు భార్యలు చనిపోయారు. ఈనాడు రోజ్ తన పక్కన కూర్చుంటే అతను విశేషంగా చలించాడు. చివరకు మాట్లాడాలనే నిశ్చయంతో, మాటిమాటికీ కిటికీవైపు చూస్తూ, అస్పష్టంగా, అనుమానిస్తూనే సంభాషణ ప్రారంభించాడు.

"నీ జీవితంలో ఒక స్థిరత్వాన్ని గూర్చి నీవు ఇంతవరకూ ఎందుకు ఆలోచించలేదు రోజ్?" అన్నాడు.

ఆమె తెల్లబోయి మాట్లాడలేకపోయింది.

"నువ్వు చాలా మంచిదానివి. ఆరోగ్యంగా వుంటావ్. ఎంతో ఉత్సాహంగా పనిచేస్తావు. ఎంతో పొదుపుగా కూడా వుంటావు. నీవు మెట్టిన ఇల్లు కళకళలాడి, ఐశ్వర్యంతో నిండిపోతుంది" అన్నాడు యజమాని.

ఆమెలో చలనం లేదు, కళ్ళలో మాత్రం భయం స్పష్టంగా కనిపిస్తోంది. యజమాని అన్నమాటల అర్థం కూడా ఆమెకు తెలియలేదు. హఠాత్తుగా ఏదో పెద్ద అపాయం ఎదురైనప్పుడు, ఏ శక్తీ పనిచేయలేని స్థితికి దిగజారినట్టయింది.

మరికొన్ని క్షణాల తరువాత యజమాని అన్నాడు. "ఇంత ఆస్తి వున్నాక, దీనికి నీలాటి సేవకురాలు వున్నా, ఒక ఇల్లాలు లేకుండటం పెద్దలోపమే అవుతుంది."

ఇంకేం మాట్లాడాలో తెలియక ఆగాడు. ఏ కూనీకోరు ఎదుటనో వుండి, ఎదుటి వ్యక్తిలోని ఏ కాస్త చలనమైనా తనను పరుగెత్తేట్టు చేయగలిగే స్థితిలాంటిదాన్నే ఎదుర్కొన్నట్టుంది.

మరో ఐదు నిమిషాలు గడిచాక "నీకిది ఇష్టమేనా?" అన్నాడతను.

"ఏమిటది?" అనగలిగిందామె.

"నన్ను పెళ్ళాడటం!"

ఆమె ఎగిరిపడటంలో కుర్చీలోంచి కిందపడింది. తనకే పెద్ద దెబ్బ తగిలినట్టే ఆమె ఆ ప్రదేశం నుంచి కొన్ని నిమిషాల వరకూ కదలలేకపోయింది. యీ వాతావరణాన్ని భరించలేక యజమాని "నీకు ఇంతకన్న ఏం కావాలి?" అన్నాడు.

ఎంతో భయంతో రోజ్ అతని మొహంలోకి చూసింది. చప్పున ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగినవి. తడి ఆరే గొంతుతో "నేను చేసుకోలేను" అన్నది రెండుసార్లు.

"ఎందుకని? పిచ్చివేషాలు వేయకు. పోనీ ఆలోచించుకొని రేపు చెప్పు" అని, చాలాకాలం నుంచీ తనను బాధిస్తూన్న వ్యవహారాన్ని ఏదోవిధంగా వొక వొడ్డుకు పట్టించాననే సంతోషంతో, అతను చకచకా బైటికి వెళ్ళిపోయాడు.

రోజ్‌కు తను ఇచ్చిన యీ అవకాశం ఎంతో గొప్పదనీ, మర్నాటికి ఆమె తన అంగీకారాన్ని ఇచ్చి తీరుతుందనీ, అతని నమ్మకం. ఎంత కట్నంతో ఇతర చోట పిల్లను పెళ్ళాడినా, ఆ వచ్చే భార్య, రోజ్‌వలె తనకు ఉపయోగకారి కాదు. రోజ్ ఆధ్వర్యంలో తన ఆస్తి పెరగటం- అదే తనకెంతో లాభసాటి బేరమని కూడా అతను నమ్మాడు.

ఇందులో యీడుజోడు గూర్చి కూడా ఆలోచించవలసింది లేదు. ఎందుకంటే పల్లెపట్టున వున్న ఆసాములందరూ ఇలాటి సంబంధాల్నే చేసుకునే ఆచారం వుంది. ఆసామికూడా, మిగతా కూలీలవలెనే పనిచేస్తాడు. ఆ తరువాత కొన్నాళ్ళకు కాని ఒక యజమాని హోదా రాదు. వారి దగ్గర పనిచేసే ఆడకూలీలలో ఒకామెను యజమాని పెళ్ళాడటం, ఆమె అతనికి భార్య అయినా కూడా, పూర్వంవలెనే పనిచేయటం ఆ ప్రాంతాల్లో పరిపాటి.

ఆ రాత్రి ఆమె పడుకోలేదు. బట్టలు కూడా మార్చుకోకుండానే ఆమె పక్కమీద కూర్చుంది. తన్ను ఆవరించిన ఆశ్చర్యం వల్ల ఏడవగలిగే శక్తి కూడా ఆమెలో నశించినట్టయింది. జరిగిన సంగతుల్నీ, సంఘటనల్నీ ఆలోచించుకోలేనంతగా తల మొద్దుబారింది. అప్పుడప్పుడు - ఇకముందు ఏం జరుగుతుందోననే తలపు ఆమెను భయపెట్టసాగింది. క్రమంగా ఆమెకు యీ భయం ఎక్కువవసాగింది. వంటింటిలోని గోడ గడియారం గంట తరువాత గంట కొడుతుంటే, ఆమె దుఃఖం పెచ్చు పెరగసాగింది. వెలుగుతున్న కొవ్వొత్తి ఆరిపోయింది. ఎవరో శాపం పెట్టినట్టు, అదొక అపశకునమే అన్నట్టు- లేక ఏ గాలి మహత్యమో అన్నట్లే ఆమె భయపడింది. ఎక్కడికన్నా దూరప్రదేశానికి పరుగెత్తి ఈ వచ్చిపడే ఆపదల్ని తప్పుకుందామనే ఆలోచన కలిగింది.

ఎక్కడినుంచో గుడ్లగూబ కూత వినిపించింది. ఆమె భయంతో వణికింది. రెండుచేతుల్నీ ముఖానికి అడ్డంపెట్టుకుంది, తరువాత తలలోకి దూర్చుకొని, శరీరమంతటా చేతులతో రాచుకుంది. మెల్లిగా లేచి, నిద్రలోనే నడుస్తూన్నట్టుగా మెట్లు దిగింది. ఎందుకంటే ఇంకాసేపటికి అస్తమించబోయే చంద్రుడు ప్రసరించే కాంతివంతమైన వెన్నెలలో తనను ఎవరైనా చూస్తారేమోనని ఆమె భయం.

గేటు దాటగానే ఆమెను తిరిగి ఆశ్చర్యం ఆవరించింది. ఆ మైకంలోనే ఆమె ఉండి ఉండి వెక్కి వెక్కి ఏడ్వనారంభించింది. అలాగే కాళ్ళీడ్చుకుంటూ నడిచేప్పుడు, కాపలా కుక్కలు అరుస్తున్నవి. ఏదో పక్షి చప్పుడు చేస్తూ, తన వలెనే దారి తెలియక అటూ ఇటూ ఎగురుతూ వుంది.

నక్షత్రాలు క్రమంగా కాంతిని కోల్పోతున్నవి. పక్షులు గుంపులు గుంపులుగా బయలుదేరుతూన్నవి. తెల్లని కాంతి భూమిని ఆవరిస్తూ వుంది. తెల్లవారేందుకు ఇంకా ఎక్కువ వ్యవధి లేదు. ఎర్రని సూర్యబింబం కనిపించే సమయానికి రోజ్ అలసిపోయి, అప్పటికే ముళ్ళుదిగి బొబ్బలెక్కిన పాదాల్ని యీడ్చుకుంటూ మరి ముందుకు సాగలేక ఆగిపోయింది. ఆ దగ్గర్లోనే ఒక మడుగు కనిపిస్తే, బొబ్బలెక్కిన పాదాలకు కొంత శాంతి కలుగుతుందనే ఆశతో ఆమె పాదాన్ని నేలమీద ఆనించీ, ఆనించకుండానే అక్కడకు వెళ్ళింది.

దుమ్ముకొట్టుకున్న బూట్స్‌విప్పి, గడ్డిమీద కూర్చొని, కాళ్ళను ఆ మడుగులోకి జార్చింది. కదలికే ఎరుగని ఆ నీళ్ళల్లో అక్కడక్కడ బుడగలు బయలుదేరినవి. ఆ చల్లదనం ఆమె అరికాళ్ళనుంచి తలవరకూ వెళ్ళి ఎంతో హాయి గొల్పింది. లోతైన ఆ మడుగు మధ్యలో మునుగుదామనే పిచ్చికోర్కె కలిగింది.

ఆ నీళ్ళల్లోనే మునిగి చనిపోతే యీ సమస్యలన్నీ తీరిపోతవి. ఆమెకు యీ లోకంలో ఏదీ, చివరకు తన బిడ్డ కూడా శాంతిని ఇవ్వగలిగే స్థితిలో లేదు. శాశ్వతమైన నిద్ర, మనశ్శాంతి తనకు లభ్యమవ్వాలి. ఇదే నిశ్చయంతో ముందుకు సాగింది. ముళ్ళు గుచ్చుకుని పచ్చిపుండుగా తయారైన అరికాళ్ళలోని బాధ మరింత ఎక్కువైంది. ఇప్పటికి ఆమె కండరాల్లోకి వెళ్ళింది ఆ బాధ. ఎంతో నిరాశతో, బాధతో ఆమె మరి ముందుకు సాగలేక పెద్దగా ఏడ్వసాగింది. ఆ దారినే బండిలో పోతున్న కర్షకుడొకడు వచ్చి ఆమెను ఒడ్డుచేర్చి, జాగ్రత్తగా ఒక్కో ముల్లు తీసేసి, ఆకుపసర్లతో మందువేసి, ఆమెను యథాస్థానానికి, ఆమె యజమాని దగ్గరకు జేర్చాడు.

రెండు వారాల వరకూ ఆమె మంచంలోనే వుంది. తిరిగి ఆరోగ్యాన్ని పుంజుకో గలిగింది. కాస్త కులాసాగా వున్న రోజు ఉదయాన్నే ఆమె ఎండలో కూర్చున్నప్పుడే ఆమె యజమాని వచ్చి "సరే. ఆ వ్యవహారం పూర్తయినట్టేనా?" అని ప్రశ్నించాడు.

మొదట్లో ఆమె జవాబు చెప్పలేదు. యజమాని తీక్షణ దృష్టిని భరించలేక "లేదు. నేను చేసుకోలేను" అంది.

అతనికెంతో కోపం వచ్చింది.

"చేసుకోలేవ్? ఎందుకని?" అన్నాడు గుడ్లురుముతూ.

ఆమె ఏడుస్తూ జవాబు చెప్పింది: "చేసుకోలేను."

కోపంతోనే ఆమె ముఖంలోకి చూస్తూ "ఐతే నీకో ప్రియుడున్నాడనుకుంటా" అన్నాడు.

"కావచ్చు" అంది సిగ్గుతో వణుకుతూ.

యజమాని ముఖం కోపంతో ఎర్రనైంది.

"ఐతే నువ్వే ఒప్పుకుంటున్నావ్! చెడి బతికినదానా!... సరే. వాడెవడు? ఇల్లూ వాకిలీ లేని దమ్మిడీ చెయ్యని వెధవై వుంటాడు. ఎవరూ?" అన్నాడు.

ఆమె జవాబు చెప్పలేదు. అతను అన్నాడు. "నువ్వు చెప్పవన్నమాట? ఐతే నేనే చెప్పుతాను. జీన్‌గాడేనా?"

"కాదు."

"ఐతే పెర్రీమార్టిన్?"

"ఉహూం"

కోపంతోనే తన ఎరికలో వున్న యువకుల పేర్లు ఒక్కొక్కటే ఏకరువు పెట్టసాగాడు. కనుచివర్లలోని కన్నీళ్ళను తుడుచుకుంటూ, 'కాదు' అనే జవాబును చెపుతూనే వుంది. ప్రతీసారీ, తను ఆ ప్రియుణ్ణి కనుక్కున్నాననే ఆశతో యజమాని ఒక పేరు చెప్పటం, ఆమె 'కాదు' అనగానే సగం చచ్చినట్టవటం జరుగుతోంది. చావు దెబ్బ తప్పించుకుందామని జంతువు అటూ ఇటూ పరుగులెత్తినట్టే ఆమె కూడా ఎంతో బాధతో ప్రతిసారీ తప్పుకునేందుకే ప్రయత్నించసాగింది.

హఠాత్తుగా యజమాని అన్నాడు. "ఆఁ కనుక్కున్నాను... జాన్‌గాడు ఔనా? వాడు వెళ్ళిపోయి సంవత్సరమౌతుంది. మీరిద్దరూ రహస్యంగా కలుసుకునేవాళ్ళని అందరూ అనుకునేవాళ్ళు. వాణ్ణి పెళ్ళాడాలని కూడా నువ్వు అనుకున్నావటగా?"

ఇప్పటికే రోజ్ గొంతు తడి ఆరుతోంది. యీ మాటల్తో ఆమె ముఖం ఎర్రనైంది. ఇంతకు పూర్వం ఆమె చెక్కిళ్ళ మీద కన్నీటి బిందువులు, కాలే ఇనుము మీది నీటి బిందువులవలె ఇట్టే ఎండిపోయినవి.

"కాదు... అతను కానేకాదు" అంది రోషంతో.

నిజంలో కొంతభాగం, చేజిక్కిందనుకున్న యజమాని, ఆమెను బోల్తాకొట్టించాలనే ఉద్దేశంతో సౌమ్యంగా "ఐతే అదంతా నిజమేనా?" అన్నాడు.

ఆమె వెంటనే జవాబిచ్చింది. "నేను ప్రమాణం చేసి చెపుతాను." ప్రమాణం చేసేందుకు పవిత్రం కానిదేదన్నా వున్నదేమోనని ఆమె ఆలోచిస్తోంది.

"ఏమైనా వాడు నిన్ను వెంటాడేవాడు. వాడి చూపులు ఎప్పుడూ నీమీదనే వుండేవి. ఎప్పుడైనా వాడికి వాగ్దానం చేశావా?"

యీసారి ఆమె, యజమాని ముఖంలోకి సూటిగా చూస్తూ "లేదు. ఎప్పుడూ లేదు. నేను ప్రమాణం చేసి చెపుతాను. యీనాడు అతను వచ్చి తనను పెళ్ళాడమని అడిగితే, అతనితో నాకెలాంటి సంబంధమూ లేదని చెప్పగలను" అందామె.

ఏదో సత్యాన్ని వెలిబుచ్చిన కంఠస్వరం స్ఫురించటం వల్ల, యజమాని పస్తాయించాడు.

తనలో తానే మాట్లాడుకుంటూన్నట్టుగా 'ఇంతా ఏడుస్తే నువ్వు కాలుజారనే లేదన్నమాట? వీళ్ళందరూ నీ గూర్చి మాట్లాడుకోవడం నిరాధారంగానేనన్నమాట? అంతేలే... ఏదైనా వుంటే దాని ఫలితాలు అనుభవించాల్సి వుండేది కాదూ? పోతే యీ కారణాలవల్ల ఏ యువతీ తన యజమానిని పెళ్ళాడేందుకు నిరాకరించదు. ఇంకా ఏదో కుంభకోణం ఉండి వుండాలి' అని మెల్లిగా గొణిగాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు. మాట్లాడగలిగే శక్తి ఆమెలో లేదు. అతను మళ్ళీ అడిగాడు. "ఐతే చేసుకోవన్నమాట?"

"నేను చేసుకోలేను" అంది నిట్టూరుస్తూ, యజమాని వెళ్ళిపోయాడు.

ఈ సమస్య పూర్తిగా వదిలించుకొన్నాననే నమ్మకంతో ఆమె ఆ పగలల్లా ఎంతో ఉత్సాహంతో పనిచేసింది. బాగా అలసిపోయి, సాధ్యమైనంత త్వరలోనే ఆమె గాఢనిద్రకు ఉపక్రమించింది.

అర్ధరాత్రి రెండుచేతులు ఆమెను కదిపి నిద్రనుండి మేల్కొల్పినవి. ఆమె భయంతో వణికిపోతోంది.

"భయపడవోక... నేను నీతో మాట్లాడేందుకు వచ్చాను" ఆ కంఠధ్వని తన యజమానిదిగా ఆమె వెంటనే పోల్చుకో గలిగింది.

మొదట్లో ఆమె ఆశ్చర్యపడ్డది. అతను లేని స్వాతంత్ర్యాన్ని ప్రదర్శించసాగాక, తననుంచి అతనేం కోరుతున్నాడో ఆమెకు అర్థమై వొణికిపోయింది. ఆ చీకట్లో తను ఒక్కతే, ఏ రక్షణా లేకుండానే, ఆ బలశాలిని ఎదుర్కోలేని నిస్సహాయనని తెలుసుకుంది. ఆమె తన అంగీకారాన్ని ఇవ్వలేదు. దారీతెన్నూ లేకుండానే పెనుగులాడింది. అలసివున్న శరీరం ఏ నిశ్చయాన్నీ ఇవ్వలేకపోయింది. నిరాడంబర జీవుల్లో సమయం వస్తే కట్టలు తెంచుకొని బైటపడే స్వభావసిద్ధమైన కోర్కె వొత్తిడినుంచి, తనను తాను కాపాడుకునే ప్రయత్నాలన్నీ వృథా అయినవి. చాలాసేపు పెనుగులాడాక యజమాని ఆమెను, కేవలం తన పశుబలంతో ఆక్రమించుకోగలిగాడు.

ఇలా కాలుజారాక వారిద్దరూ దంపతులవలెనే రోజులు గడపసాగారు. ఒకనాడు యజమాని "పై నెలలో మనిద్దరం శాస్త్రయుక్తంగా వివాహమాడుదాం" అన్నాడు.

ఆమె ఏమీ అనలేదు. ఏమనగలదు కనుక? ఆమె నిరాకరించనూలేదు. అలాటి శక్తులు ఆమె నుంచి విడివడి చాలాకాలమైంది.

## 4

ఆమె యజమానిని వివాహమాడింది. తాను తిరిగి బైటపడలేని ఒక కూపంలో పడిపోయినట్టూ, ఎన్నో దురదృష్టాలు తన తల మీద భారంగా వేళ్ళాడుతూన్నట్టూ ఏ

క్షణాన్నయినా తను ఆత్మహత్య చేసుకొనే పరిస్థితి రాగలిగినట్టూ ఆమె భావించేది, బాధపడేది. భర్తను తాను దొంగిలించినట్టూ, ఏ క్షణానో తన యీ దొంగతనం సంగతి అతనికి తెలిసిపోవచ్చునీ ఆమె ఊహించేది. ఆ తరువాత తన బిడ్డను గూర్చి ఆమె ఆలోచించింది. బిడ్డ– తన ఆ బిడ్డే యీ బాధకు, దుస్సంఘటనలకు, దురదృష్టాలకు కారణం! సంవత్సరానికి రెండుసార్లు వాణ్ణి చూసేందుకు వెళ్ళేది. ప్రతిసారీ మరింత కుంగిపోయి తిరిగి వచ్చేది.

క్రమంగా ఆమెకు మనశ్శాంతి ఏర్పడింది. ఎందుకంటే యీ బాధాకర జీవితానికి ఆమె పూర్తిగా అలవడిపోయింది. ఎక్కడో హృదయం కీనీడల్లే కొద్ది భయంవున్నా, మొత్తం మీద ఒక సాఫీ జీవితం ఏర్పడిపోయింది. సంవత్సరాలు గడుస్తూన్నవి. ఇప్పుడు ఆ బిడ్డ వయస్సు ఆరు సంవత్సరాలు... కాని ఉన్నట్టుండి ఆమె భర్త ప్రవర్తనలో పెద్ద మార్పు కన్పించసాగింది.

రెండు మూడు సంవత్సరాల దాకా ఏదో రహస్యమైన ఆతృత, ఏదో చెప్పుకోవాలని కోర్కె మనస్సును పాడుచేసే ఏదో విషయం అతన్ని వేధిస్తున్నట్టు అతను బాధపడేవాడు. ఈ బాధ క్రమక్రమంగా హెచ్చుతూనే వుంది. భోజనమయాక కూడా చాలాసేపటివరకూ టేబిల్‌ముందే కూర్చొని, రెండుచేతుల్లోనూ తల ఇరికించి, విచారంగా బరువుగా ఏదో ఆలోచిస్తూండేవాడు. చాలా తొందరగా మాట్లాడటం, కఠినంగా ప్రవర్తించటం, ఏదో కోపాన్ని ఇంకో రూపంలో వెళ్ళగక్కటం, భార్య మీద తనకేదో తీరని పగ వున్నదనే విషయాన్ని అప్పుడప్పుడు చాటుతూనే వుండేవాడు.

ఒకనాడు పక్కింటి కుర్రవాడు కోడిగుడ్ల కోసం వచ్చాడు. రోజ్ పనిలో వుండి కాస్త విసుగ్గా మాట్లాడింది. వెంటనే ఆమె భర్త వచ్చి, కఠినమైన స్వరంతో "ఆ కుర్రవాడు నీ కుర్రవాడే ఐతే అలా మాట్లాడవ్" అన్నాడు.

ఆమె గాయపడింది. కాని ఏమీ మాట్లాడ లేదు. మానిన గాయాన్ని కెలికినట్లయింది. ఒంటరిగా తన జీవితానికి తానే సానుభూతిని చూపుకునేందుకు, ఏడ్చి కొంత హృదయారాటాన్ని మాన్పుకునేందుకు ఆమె గదిలో ఏకాంతాన్ని తిరిగి కోరింది. భోజన సమయంలో భర్త తన వైపు చూడడు, తనతో మాట్లాడడు– తనను ఏవగించుకుంటూన్నట్టు తోస్తుంది. ఏదో విషయాన్ని ఏ క్షణంలోనన్నా బైటపెట్టి మరింతగా తనను వేధిద్దామన్నట్టుగా వుంది తన భర్త ప్రవర్తన. ఆమెకు మతిపోయి నట్టయింది. భర్త భోజనం పూర్తయాక ఒక క్షణం కూడా అతని దగ్గర ఉండే ధైర్యం ఆమెకు లేదు. సాధ్యమైనంత త్వరలో బైటపడి, మనశ్శాంతి కోసం చర్చికి వెళ్ళేది.

చీకటిపడుతూ వుంది. చర్చిలోని మధ్య భాగంలో చీకట్లు కమ్ముకున్నవి. చీకట్లోనుంచి పదాల సవ్వడి వినిపించింది. ఆ తరువాత కొవ్వొత్తి వెలిగించి దూరాన

ఉంచబడింది. దానికాంతి అంతా చర్చి మూలలే పంచుకున్నవి. ఉన్న కొద్దికాంతి కిరణమే, ఆమెకొక ఆశాకిరణం వలె తోచింది. ఆమె మోకరించి ప్రార్థించింది.

ఇక ఆగలేక మతాధికార్ని చూడబోయింది. అతను భోజనం చేయబోతున్నాడు. ఆమెను అక్కడే కూర్చోమన్నాడు.

"నాకంతా తెలుసు.... నీ భర్త చెప్పాడు. నువ్విప్పుడు ఇక్కడికెందుకొచ్చావో నాకు పూర్తిగా తెలుసు" అన్నాడు.

ఆమెకు మూర్ఛపోయినంత పనయింది.

మతాధికారి మళ్ళీ అన్నాడు. "నీ కిప్పుడేం కావాలి?"

ఏదో గాబరాతో అతను త్వరత్వరగా భోజనం చేయ నారంభించాడు. రోజ్ ఏమీ మాట్లాడలేక పోయింది. వెళ్ళేందుకని నిలబడింది. "ధైర్యంగా వుండు" అన్నాడు మతాధికారి.

ఆమె ఇంటికి తిరిగి వచ్చింది. తన కోసమే భర్త వేచి వున్నాడు. అప్పటికే పనివాళ్ళందరూ వెళ్ళిపోయారు. ఆమె బరువుగా అతని కాళ్ళ దగ్గరపడి, కన్నీటితో అతని పాదాల్ని తడుపుతూ "నావల్ల ఏం నేరం జరిగింది?" అంది ప్రార్థనాస్వరంలో.

అతను కోపంతో అరిచాడు. "నేరం! నాకు బిడ్డలు లేకపోవటమే నేరం! పెళ్ళంటూ చేసుకున్నాక, వంశాన్ని ఉద్ధరించేందుకు, ప్రాణం పోయేటప్పుడు గొంతులో కాసిని నీళ్ళు పోసేందుకైనా ఒక్కబిడ్డ లేకపోయె! గొడ్డుమోతు దానికి ఎలాటి విలువ వుంటుంది!"

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ "అది నా తప్పు కాదు" అంది.

యీ సమయంలోనే అతనికి జాలి కలిగింది. మృదువుగా "అని నేను అనటం లేదు. కాని ఇది ఎంత బాధాకరమైన విషయమో చూడు" అన్నాడు.

## 5

ఆ రోజు నుంచీ ఆమెకు ఒక్కటే ఆలోచన- ఒక బిడ్డ- కాదు ఇంకో బిడ్డను కనాలి. తన యీ కోర్కెను ఆమె అందరికీ చెప్పింది. పొరుగింటాయన, గురితప్పని ఏదో ఉపాయాన్ని చెప్పాడు. ఏదో మూలిక తాలూకు బూడిదను నీళ్ళలో కలిపి, భర్తచేత తాగించమన్నాడు. దీనికి ఆమె భర్త కూడా ఒప్పుకున్నాడు. కాని అది విజయాన్ని సాధించలేకపోయింది.

'ఇంకా ఏదో రహస్యమైన మంత్రతంత్రాలు ఉండకపోవు' అనుకున్నారు దంపతులు.

వాటికోసం శక్తివంచన లేకుండా ప్రయత్నించసాగారు. ఇరవై మైళ్ళలో వున్న గొల్లాడిచేత రక్షరేఖ కట్టించుకున్నా ప్రయోజనం లేకపోయింది. ఇట్లాగే బడిపంతులు

చెప్పిన ప్రక్రియలు కూడా వృథా అయినవి. మఠాధికారి పుణ్యక్షేత్రాల్ని దర్శించమని సలహా ఇచ్చాడు. భక్తితో వారు యోగుల సమాధుల ముందు దీనంగా ప్రార్థించారు. కాని లాభం లేకపోయింది. ఇదంతా, తాను మొట్టమొదట కాలు జారటం వల్లనే, తనను భగవంతుడు యీ విధంగా కఠినంగా శిక్షిస్తున్నాడని రోజ్ నమ్మింది. ఏదో పెద్ద దుఃఖ తరంగం ఆమెను పూర్తిగా ఆవరించేసింది. యీ దుఃఖంతో ఆమె రోజురోజుకూ తీసిపోతోంది. ఆమె భర్తలో ముసలితనం తరుముకొని వస్తోంది. తీరని కోరికలతో, యీడు రాకుండానే అతను శక్తిహీను డౌతున్నాడు.

ఆ దంపతుల మధ్య ఒక యుద్ధం ప్రారంభమైంది. ఆమెను నానామాటలూ అనటం, చావబాదటం సాగించాడు. పగలల్లా వాగ్వాదంలోనే గడిపేవారు. రాత్రి గదిలో ఆమెను బండబూతులు తిట్టేవాడు. ఆమె బాధపడితేకాని అతనికి తృప్తి కలగటం లేదు. ఒకనాటి రాత్రి విపరీతమైన కోపంలో– బైట ఏకధారగా వానకురుస్తూంటే, ఆమెను బైటికి నెట్టి, తెల్లవారేదాకా తలుపు తీయనేలేదు. తను చెప్పినదాన్ని శిరసావహించినట్టు కనిపించకపోతే, ఆమెను మెడపట్టుకొని మొహంమీద గుద్దేవాడు. ఆమె ఆ దెబ్బలబాధను భరిస్తూ కదిలేది కాదు, మెదిలేది కాదు. ఇది మరింతగా అతన్ని బాధించేది. పళ్ళు కొరుకుతూ ఆమెను చీల్చేటంత కోపంతో ఆమెమీద ఉరికేవాడు. ఒకనాటి రాత్రి ఆమెను నానావిధాలా బాధించాడు. గోడ దగ్గర నిలబెట్టి ఆమె తలను గోడకేసి బాదాడు. ఆమె ఇక భరించలేకపోయింది. తిరగబడి అతన్ని బలంగా విదిలించింది.

"నాకు ఒక బిడ్డ వున్నాడు... జాన్ వల్ల ఆ బిడ్డను కన్నాను. అతను నన్ను వివాహమాడుతానని ప్రమాణం చేసి మోసం చేసి వెళ్ళిపోయాడు" అంది కోపంతో బుసకొడుతూ.

అతని నెత్తిన పిడుగుపడ్డట్టయి మొదట్లో శిలాప్రతిమవలె నిలబడిపోయాడు. "ఏమంటున్నావ్? ఏమంటున్నావ్?" అన్నాడు పెద్దగొంతుతో, అధికారపూర్వకంగా.

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ మెల్లిగా చెప్పనారంభించింది. "ఆ కారణం వల్లనే నేను నిన్ను వివాహమాడేందుకు ఇష్టపడలేదు. అప్పుడు నేనేమీ చెప్పదల్చుకోలేదు. ఎందుకంటే యీ ఉద్యోగం పోతే నేనూ, నా బిడ్డా అడుక్కుతినే ఖర్మ పడుతుందని, నీకు బిడ్డలంటూ లేరు కనుక– ఈ విషయం అర్థం కాదు. ఎప్పటికీ అర్థమవదు."

ఏదో పెద్ద ఆశ్చర్యంతో అతను "నీకొక బిడ్డ వున్నాడా?" అన్నాడు.

"నీవు నన్ను కేవలం పశుబలంతో లొంగదీసుకున్నావు. ఆ సంగతి నీకూ తెలుసు. నిన్ను వివాహమాడటానికి నేనెప్పుడూ ఇష్టపడలేదు" అందామె.

అతను లేచి నిలబడి కొవ్వొత్తులు వెలిగించాడు. చేతులు రెండూ వెనక్కు పెట్టుకొని గది నలుమూలలా నడవసాగాడు. ఆమె తలగడలో మొహం దాచుకొని ఏడుస్తూ

వుంది. హఠాత్తుగా అతను ఆమె ముందు నిలబడి "ఐతే మనకు బిడ్డలు లేకపోవడం నా తప్పు- ఔనా?" అన్నాడు.

ఆమె జవాబు చెప్పలేదు. అతను తిరిగి అటూ ఇటూ తిరుగుతూ, మళ్ళీ ఆమె ముందు నిలబడి "నీ బిడ్డకు, ఇప్పుడు వయస్సెంత వుంటుంది?" అన్నాడు.

"ఆరేళ్ళు."

"ఇదివరకు నాకీ సంగతి ఎందుకు చెప్పలేదు?"

"ఎట్లా చెప్పేది?" అందామె నిట్టూరుస్తూ.

అతను కొన్ని క్షణాలుపాటు చలనమే లేకుండా నిలబడి "సరే...రా...లే" అన్నాడు.

ఆమె ఎంతో కష్టంమీద లేచి నిలబడింది. ఆమె భుజాల్ని పట్టుకొని ఊపుతూ, హృదయపూర్వకంగా నవ్వాడు. గడిచిన మంచిరోజుల్లోని నవ్వును, యీ నవ్వు పోటీ చేస్తూవుంది.

ఆమెకేమీ అర్థం కాలేదు. ఆమె ఆశ్చర్యాన్ని చూసి అతను అన్నాడు. "మనిద్దరికీ మరి పిల్లలు కలగరు గనుక ఆ పిల్లవాణ్ణి తెచ్చుకుందాం."

యీ మాటలకు ఆమె మిగతా శక్తులు పనిచేయటం లేదు. ఏ కాస్త శక్తి వున్నా ఆమె ఎటుపడితే అటు పరుగెత్తేది. భర్త చేతులు నలుపుకుంటూ "నేను అనుకున్నాను ఎవర్నన్నా పెంచుకుందామని, ఇప్పుడు మనకొక బిడ్డ దొరకనే దొరికాడు. కొన్నాళ్ళ క్రితం అనాథగా వున్న ఒక బిడ్డను చూడమని మతాధికారికి కూడా చెప్పాను" అన్నాడు.

మరింతగా నవ్వుతూ, ఏడుస్తూ, ఆశ్చర్యంతో కదల మెదల లేకుండా వున్న భార్యను దగ్గరకు లాక్కొని ముద్దుపెట్టుకుంటూ, ఇందాకటి నుంచీ తన మాటలు ఆమెకు వినపడటం లేదన్నట్టు పెద్దగా అరిచాడు. "సరే. నాకు ఆకలవుతోంది. కిందికి వెళ్దాం."

ఇద్దరూ కిందికి వెళ్ళారు. అగ్నిగుండం ముందు నిలబడి ఆమె నిప్పుచేస్తూ వుంది. అతను నలుమూలలా తిరుగుతూ అన్నాడు: "నాకు నిజంగా ఎంతో సంతోషంగా వుంది. ఏదో మాట వరసకు అనటం లేదు. నాకు ఆనందం- ఎంతో ఆనందంగా వుంది రోజ్!" అన్నాడు.